క్లుప్తంగా

రికార్డుల పరిశీలన

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాలలో శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ అంజిరెడ్డి, కో ఆర్డినేటర్ శ్రీదేవి ఆడిట్ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం లెక్చరర్స్‌కు పలు సూచనలు, సలహాలు చేశారు. వారి వెంట ప్రిన్సిపాల్ సుక్క సునీల, వైస్ ప్రిన్సిపాల్ ప్రవళిక, అరుణ తదితరులున్నారు.

పశువైద్యశాలలో రికార్డుల పరిశీలన

నూతనకల్ : జీవాలకు, పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎర్రపహాడ్ పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా అందించే మందుల వివరాలు, వైద్య శిబిరాల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పశువైద్య సిబ్బంది పద్మ తదితరులు ఉన్నారు.

వైభవంగా దీపారాధన



అర్వపల్లిలోని చిన్న దర్గావద్ద దీపాలు వెలిగిస్తున్న నిర్వాహకులు, భక్తులు

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని గుట్టల మధ్య ఉన్న సయ్యద్ జాన్‌పాక్ షాహిద్‌ఖాజా మోయినోద్దీన్ బాబా దర్గా (చిన్న దర్గా) ఉర్సులో భాగంగా శనివారం దీపారాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా లోపల, వెలుపల పరిసరాల్లో దీపాలను వెలిగించి బాబాకు ప్రార్థనలు చేశారు. అనంతరం గౌసేపాక్ దర్గాలో కూడా దీపాలు వెలిగించారు. దీపారాధనతో చిన్నదర్గా ఉర్సు వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ముజావర్ మహ్మద్ హబీబ్ రహెమాన్, జానీ, సైఫ్, ముజీబ్, బషీర్, వీరస్వామి, బాజీ, హుస్సేన్, వెంకన్న, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి : మండలంలోని తాటిపాముల బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం గ్రామ ప్రజలు పట్టుకొని గ్రామ పంచాయతీలో అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తాటిపాముల గ్రామం నుంచి ఒకటి, రెండు ట్రాక్టర్లకు పర్మిషన్లు తీసుకొని పదుల సంఖ్యలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. 5 గంటల తరువాత కూడా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇష్టానుసారంగా తరలిస్తున్నారని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన మహబూబా ఉర్సు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న మహబూబా ఉర్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ముజావరి సయ్యద్ పాష ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దీపారాధనతో వేడుకలు ముగించారు. జాతర ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకుడు గోపగాని సందీప్ తెలిపారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నూతనకల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి కోరారు. శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మాత జనరల్ ఆస్పత్రిలో హన్మకొండలోని శరత్ కంటి వైద్యశాల సిబ్బంది నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే నాగుల్ మీరా, సాబాది వెంకట్‌రెడ్డి, బందు కృష్ణయ్య, ఏలేటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మందలోకి దూసుకెళ్లిన కారు

- 15 మేకలు మృతి

అర్వపల్లి : సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై అర్వపల్లిలో శనివారం మేకల మందపైకి కారు దూసుకెళ్లి 15 మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మల్లెబోయిన కృష్ణ మేకల మందపైకి జనగామ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు అతివేగంగా దూసుకెళ్లింది. దీంతో 15 మేకలు మృతి చెందాయి. మరికొన్ని మేకలు గాయపడ్డాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతి చెందిన మేకలు రూ.2లక్షలకు పైగా విలువ చేస్తాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

డ్రమ్‌సీడర్‌కే రైతుల మొగ్గు

- నాగారం మండలంలో 19వేల ఎకరాల్లో వరి సాగు అంచనా
- ఖర్చులు తగ్గుతుండడంతో డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులకు ప్రాధాన్యం
- కూలీల కొరతకు చెక్..



నాగారంలో డ్రమ్‌సీడర్‌తో వరివిత్తనాలు వేస్తున్న రైతులు

నాగారం : వరిసాగులో కూలీల కొరతను అధిగమించడం, నాట్ల ఖర్చును తగ్గించుకోవడానికి ప్రస్తుత యాసంగిలో రైతులు డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతికి మొగ్గు చూపుతున్నారు. నాలుగేళ్లుగా వెదజల్లే, డ్రమ్‌సీడర్ విధానంతో సాగు చేసిన పంట పొలాలు మంచి దిగుబడిచి ఇస్తుండటంతో రైతులు ఈ పద్ధతులు అనుసరిస్తున్నారు. కొద్ది మంది రైతులు మాత్రమే నారును సిద్ధం చేసుకుంటున్నారు.

కూలీల కొరతను అధిగమించేందుకు..

నాగారం మండలంలో ఇప్పటికే యాసంగి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులందరూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడంతో కూలీల కొరత కూడా పెరుగుతోంది. ఒక్కోసారి కూలీల కోసం వారం, పది రోజుల పాటు వేసి చూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కూలీలు సమయానికి రాకపోవడంతో 25 రోజులకు నాటు పెట్టాల్సిన పొలాలు నెలన్నరకుపైగా వాయిదా పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. సమయానికి నాటు వేయకపోవడంతో పంట దిగుబడి తగ్గి సగం పంట కూడా చేతికి రాని పరిస్థితులు ఉండేవి. కూలీలు వస్తారని దమ్ము చేసిన పొలాలు ఆ కూలీలు ఆలస్యంగా రావడంతో మళ్లీ దమ్ము చేయాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గేదని రైతులు పేర్కొంటున్నారు.

డ్రమ్‌సీడర్ విధానం వల్ల..

ప్రస్తుతం రైతులు డ్రమ్‌సీడర్, వెదజల్లే విధానాలను ఎక్కువగా పాటిస్తున్నారు. ఈ నూతన విధానాల వల్ల ఎకరాకు దాదాపు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చులు తగ్గుతున్నాయి. అంతే కాకుండా డ్రమ్‌సీడర్ విధానంలో విత్తనం ఒక దానితో ఒకటి కలవకుండా దూరంగా పడటంతో మొక్కల వేర్లు బలంగా ఉండి దిగుబడి ఎక్కువగా వస్తోంది. డ్రమ్‌సీడర్ పద్ధతితో పంట 15–20 రోజుల ముందే చేతికొస్తుండటం, కూలీల ఖర్చు తగ్గుతుండటంతో రైతులు ఈ పద్ధతికే ఆసక్తి చూపుతున్నారు.

70శాతం మందికిపైగా డ్రమ్‌సీడర్ విధానంలోనే సాగు

నాగారం మండలంలో గత వానాకాలంలో దాదాపు 18 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ఈ యాసంగిలో సుమారు 19వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే మండలంలో ఇప్పటికే వరినాట్లు 80శాతానికిపైగా పూర్తయ్యాయి. కాగా మండలంలో 70శాతం మేర రైతులు డ్రమ్ సీడర్ పద్ధతినే అవలంబించడం గమనార్హం.

ఖర్చు తగ్గుతుంది



“డ్రమ్‌సీడర్ పద్ధతితో కూలీల ఖర్చు తగ్గుతుంది. నాకున్న 3 ఎకరాల్లో డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్నా. గతంలో కూలీలతో నాట్లు వేయిస్తే ఎకరాకు రూ.6వేలు ఖర్చు అయ్యేది. కానీ డ్రమ్‌సీడర్‌తో రూ.3వేలతో నాటు పూర్తవుతుంది. దిగుబడి కూడా ఎకరాకు 3 నుంచి 4 బస్తాలు అధికంగా వస్తుంది.

– సంకిటి వెంకటేశ్వర్లు, రైతు, పసునూర్

డ్రమ్‌సీడర్ పద్ధతితో అధిక లాభాలు



“నాటు వేసే పద్ధతి కంటే వెదజల్లుడు, డ్రమ్‌సీడర్ పద్ధతితో అధిక లాభాలు పొందవచ్చు. కలుపును నియంత్రించుకుంటే పంట దిగుబడి పెరుగుతుంది. డ్రమ్‌సీడర్‌తో కూలీల ఖర్చు తగ్గి, దిగుబడి కూడా పెరుగుతోంది. మండలంలో 70శాతం మంది రైతులు డ్రమ్‌సీడర్‌కే ఆసక్తి చూపుతున్నారు.

– పెందోట గణేష్, ఏఓ, నాగారం

అభివృద్ధి, ఆత్మగౌరవం కోసమే అవిశ్వాసం



సమావేశంలో మాట్లాడుతున్న నిఖిల దిలీప్‌రెడ్డి

సూర్యాపేట : అభివృద్ధి, ఆత్మగౌరవం కోసమే సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టామని చైర్మన్ రేసులో నిలిచిన కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో 30 మంది కౌన్సిలర్లతో కలిసి ఆమె మాట్లాడారు. నాలుగేళ్లుగా కౌన్సిలర్లకు గౌరవం దక్కలేదని, వార్డుల్లో అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందని అన్నారు. తమ వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ఈ క్రమంలో 32 మంది కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో ప్రస్తుతమున్న చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టాలని ఈనెల 10వ తేదీన కలెక్టర్‌ను కోరామని తెలిపారు. 17రోజులుగా ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఎవరూ పట్టించుకోకపోడంతో చివరకు కార్యకర్తలను బెదిరించారని తెలిపారు. ఎమ్మెల్యేగా డబ్బులు పంపిణీ చేసి గెలిచిన జగదీష్‌రెడ్డి అదే డబ్బుతో అవిశ్వాసం వీగిపోయేలా చేశారని అన్నారు. తమవర్గంలోని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్‌ను రూ.50లక్షలకు కొనుగోలు చేశారని తెలిపారు. దీంతో అవిశ్వాసం గెలిచే పరిస్థితి లేకపోవడంతో సమావేశానికి హాజరుకాలేదని అన్నారు. డమ్మీ చైర్‌పర్సన్ అయిన అన్నపూర్ణ చేస్తున్న అవినీతి పనులను రానున్న రోజుల్లో అడ్డుకుంటామని తెలిపారు. ఈ అవిశ్వాసంలో తాము గెలవనప్పటికీ నైతిక విజయం సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్యాన్స్, డ్రాయింగ్, సంగీతం, వాయిద్యం, కుట్లు, అల్లికల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం గోలి పద్మ, విశ్రాంత అధ్యాపకుడు హమీద్‌ఖాన్, హెచ్‌ఎం కళారాణి, రోజా, బాల కేంద్రం సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, ఎల్లయ్య, సత్యనారాయణసింగ్, ఉమా, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' స్పెల్‌బీలో విద్యార్థి ప్రతిభ



కార్తికేయ శ్రీవాత్సవ

సూర్యాపేటటౌన్ : సాక్షి మీడియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి స్పెల్‌బీ 2024 పోటీల్లో జిల్లా కేంద్రంలోని జయ స్కూల్ విద్యార్థి కొమ్ము కార్తికేయ శ్రీవాత్సవ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ శనివారం తెలిపారు. హన్మకొండలో జరిగిన సెమీ ఫైనల్స్‌లో పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా.. 8వ తరగతి విద్యార్థి కొమ్ము కార్తికేయ శ్రీవాత్సవ హైదరాబాద్‌లో జరిగే స్టేట్ ఫైనల్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



భానుపురి : మహదేవ్‌ను సన్మానిస్తున్న కార్మికులు



తుంగతుర్తి : తుంగతుర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎలక్ట్రీషియన్ల సంఘం నాయకులు

భానుపురి : తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ పీవీసీ ప్రొడక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ వేడుకలకు హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఈ ఉత్సవాన్ని జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. కార్మికులు మీలా మహదేవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తోట శ్రవణ్‌కుమార్, కాపార్ అసోసియేషన్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ మంజుల, రాజు, యూనియన్ నాయకులు సత్యనారాయణ, జానిపాషా, వెంకటేశ్వర్‌రావు, యాదగిరి, ప్రవీణ్, రవి, శేషు, నబి, మహిమూద్ అలీ, శ్రీనివాస్, సోమయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఎలక్ట్రీషియన్స్ డేను పురస్కరించొని టీపీఈటీఎఫ్ నాయకులు శనివారం మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించి, కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీఈటీఎఫ్ మండల అధ్యక్షుడు కటకం వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రపంచానికి విద్యుత్ వెలుగులు అందించిన రోజు జనవరి 27 అని అన్నారు. విద్యుత్ బల్బును కనిపెట్టి ప్రపంచానికి వెలుగును అందించిన మహనీయుడు థామస్ అల్వా ఎడిసన్ అని కొనియాడారు. అనంతరం ఎలక్ట్రీషియన్ల సంఘం సభ్యులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఈటీఎఫ్ నాయకులు కటకం అశోక్, బుచ్చయ్య, ప్రవీణ్, బ్రహ్మచారి, వెంకన్న, ఉపేంద్రచారి, రవి, సుధాకర్, యాకుబ్, గునగంటి రమేష్, అంజయ్య, సురేష్‌రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



మద్దిరాల : గోపాల మిత్ర భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక, ఎమ్మెల్యే సామేల్



నాగారం : మాచిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరిలో చంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అధికారం దక్కాలన్నా, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నా కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు తనను 51వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారని, తాను నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గత పాలకులు ఈ ప్రాంతంలో ఇసుక దోపిడీ చేశారని, తాను ఏటి ఇసుకను పరిరక్షించి, నీటి వనరులను కాపాడుతానన్నారు. మాచిరెడ్డిపల్లి గ్రామంలో 3 కి.మీ మేర తాళ్లబాటకు, నాగారం డొంకబాటకు సీసీరోడ్డు నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. వర్ధమానుకోట నుంచి మాచిరెడ్డిపల్లి మీదుగా ఈటూరుకు డబుల్‌రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని, బస్సు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. అనంతరం రూ.5లక్షల ఎంపీ నిధులతో గ్రామంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, ఎంపీడీఓ జి.శోభారాణి, సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ చింతరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ వడ్డే మహేష్, పీఆర్ ఏఈఈ రవికుమార్, విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, మాజీ సర్పంచ్ శీల స్వరూపకృష్ణమూర్తి, ఎల్మకంటి సోమన్న, యారాల ఇంద్రాసేనారెడ్డి, కాశీ వెంకటేశ్వర్లు, నాతి వీరమల్లు, వడ్డే ఎల్లయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనతోనే సంక్షేమం

మద్దిరాల : ప్రజాపాలనతోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. రెడ్డిగూడెంలో రూ.10.50లక్షలతో నిర్మించిన గోపాల మిత్ర భవనాన్ని, రూ.15లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను, పాఠశాలలో రూ.15లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను శనివారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, నాయకులు రేట్నేని శ్రీనివాస్, నాగెల్లి అరుణ్‌కుమార్, సర్పంచ్ బర్పటి ఉపేందర్, ఎంపీటీసీ నాగెల్లి శ్రీలత శ్రవణ్‌కుమార్, ఉపసర్పంచ్ దు గ్యాల ఉపేంద్ర రవీందర్, పచ్చిపాల వెంకన్న, దగ్గుల మలయ్య, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పాక అమృత మల్లు, కొమ్ము వెంకన్న, ఉపేందర్, తీగల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి ఎమ్మెల్యే నివాళి

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంట అమరేందర్‌రెడ్డి తండ్రి గంట చంద్రారెడ్డి శుక్రవారం రాత్రి మృతి చెందారు. దీంతో అతడి మృతదేహాన్ని స్థానిక శాసన సభ్యుడు మందుల సామేల్ సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, సంకెపల్లి కొండల్‌రెడ్డి, మూల అశోక్‌రెడ్డి, ఎండీ.హఫీజ్, పేరాల వీరేష్, జమ్మిలాల్, ఖలీమ్, జనార్దన్, అబ్బాస్, రాము గౌడ్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి పోటీలు



సూర్యాపేట టౌన్ : విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న రమేష్‌బాబు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ విభాగాలకు చెందిన 45 పాఠశాలల నుంచి 135 మంది విద్యార్థులు చెకుముకి పరీక్షలో పాల్గొన్నారు. అనంతరం జేవీవీ జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు మాట్లాడారు. మండల స్థాయి నుంచి మూడు పాఠశాలలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పోటీలను ఫిబ్రవరి 3వ తేదీన మునగాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు మారం నారాయణరెడ్డి, వల్లపట్ల దయానంద్, భయ్యా మల్లికార్జున్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి..

పెన్‌పహాడ్ : విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకొని, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని మండల విద్యాధికారి నకిరేకంటి రవి, జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ యాదగిరి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముఖి మండల స్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో తెలుగు విభాగంలో లింగాల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఇంగ్లిష్ విభాగంలో అనాజిపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ముందంజలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు ఎంఈఓ, జన విజ్ఞాన వేదిక సభ్యులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, జమాల్ షరీఫ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నాగారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మీడియం నుంచి జెడ్పీహెచ్‌ఎస్ డి.కొత్తపల్లి, ఇంగ్లిష్ మీడియం నుంచి జెడ్పీహెచ్‌ఎస్ ఈటూర్ విద్యార్థులు ప్రథమ బహుమతులు గెలుపొందారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాకు ఎంపిక చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పల్స వెంకన్న, నారాయణ, ఉపాధ్యాయులు సిద్ధిరంగాచారి, మహేష్, రామచంద్రయ్య, గోవర్ధన్, రాజ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుమలగిరి : చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్, జిలుకర శ్రీనివాస్, జానయ్య, యాదగిరి, సత్తిరెడ్డి, భాస్కర్, స్వామి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ద్వారా విజ్ఞానం పెంపొందుతుంది

తుంగతుర్తి : సైన్స్ ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎడ్ల గోపయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. టీఎస్‌ఆర్‌ఎస్ బాలుర గురుకుల పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్ అన్నారం, మేరిమదర్ పాఠశాలలు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ప్రధానోపాధ్యాయులు కొండగడుపుల యాకయ్య, గురువయ్య, వెంకట్‌రెడ్డి, భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పసునూర్ మోడల్‌స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజా ప్రతినిధుల, అధికారుల, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుంట రమేష్, ఉపాధ్యాయులు ఎం.రమేష్, భూతం యాకమల్లు, పి.శ్రీనివాస్, కావలి కార్తీక్, మానసవీణ, కరుణాకర్, రోజా, సరిత, రాజ్‌కుమార్, జగన్, గణేష్, నాగరాజు, మహేష్, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండలానికి చేరుకున్న పాదయాత్ర



ఆత్మకూరులో కొనసాగుతున్న పాదయాత్ర

ఆత్మకూర్ (ఎస్) : వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చేపట్టిన భూపాలపల్లి టు తిరుపతి పాదయాత్ర శనివారం ఆత్మకూరు మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో అమ్మవారికి గండ్ర జ్యోతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. భూపాలపల్లిలో నిర్మించ తలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయం ఒక సంవత్సర కాలంలోనే అత్యంత అద్భుతంగా పూర్తయిందని తెలిపారు. దీంతో తాను మొక్కుకున్నట్లుగా భూపాలపల్లి నుంచి తిరుపతికి పాదయాత్ర చేస్తున్నానని, 8వ రోజు పాదయాత్రలో దండుమైసమ్మ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. తనతోపాటు మరో 10మంది భక్తులు పాదయాత్రలో పాల్గొంటున్నారని చెప్పారు. నెమ్మికల్‌లో జరిగిన పాదయాత్రలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

తుంగతుర్తి : గ్రామాల అభివృద్ధి కోసం 2024–25 సంవత్సరానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఎంపీడీఓ భీంసింగ్ తెలిపారు. శనివారం తుంగతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీపీడీపీ 2024–25 బ్లాక్ అభివృద్ధి ప్రణాళిక అమలుపై చర్చించారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడే విధంగా ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ఏపీఓ కృష్ణయ్య, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంపై విద్యార్థుల ప్రదర్శన

ఆత్మకూర్ (ఎస్) : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆత్మకూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పౌష్టికాహారంపై తమ ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థుల ప్రదర్శనను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, డీఈఓ అశోక్‌లు పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, వనజ, ప్రభాకర్, యాదగిరి పాల్గొన్నారు.

సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా సంపత్

నాగారం : యూత్ కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా శాంతినగర్ గ్రామానికి చెందిన జేరిపోతుల సంపత్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉపేందర్

అర్వపల్లి : తెలంగాణ స్టూడెంట్స్ యూత్ అసోసియేషన్ (టీఎస్‌వైఏ) ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన వేముల ఉపేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు టీఎస్‌వైఏ రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు నియామకపత్రాన్ని పంపారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తనను ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

హుస్సేన్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇరుగు హుస్సేన్ మృతి పార్టీకి తీరని లోటని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం హుస్సేన్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేశ్వరం చంద్రకళ, తీగల గిరిధర్‌రెడ్డి, పన్నాల మల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, కట్ట మల్లారెడ్డి, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, నకిరేకంటి రవి, జటంగి గణేష్, నెల్లుట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

పెన్‌పహాడ్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సర్పంచ్ ధరావత్ భిక్షం అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఎల్లప్పకుంట తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సుమారు రూ. 3వేలు విలువ చేసే వాటర్ బాటిల్స్, స్టీల్ బాక్సులు, డ్రాయింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంధ్యాల వినోద్, ఉపాధ్యాయురాలు పావని, రమేష్, రవి, నీలారాములు, శారద, సైదా, వెంకన్న, సకురాం, జానీబాయ్, బుజ్జి, నాగు, సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.